ఎవరి సొమ్ము వారికే

ఏ గుడి ఆదాయం అక్కడే వినియోగం

ఆలయాల ముందు బోర్డుల ఏర్పాటుకు నిర్ణయం

ఆదాయ, వ్యయాలు భక్తులకు తెలిసేలా ప్రదర్శన

ప్రభుత్వం కీలక నిర్ణయం



కుక్కె సుబ్రహ్మణ్య ఆలయం



మంత్రి రామలింగారెడ్డి

బెంగళూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల హుండీ సొమ్ముతో పాటు, ఇతర కానుకలు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలకు చెక్ పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏ గుడి ఆదాయం ఆ గుడికే ఖర్చు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రతి గుడి వద్ద దేవదాయశాఖ ఆలయం ఆదాయం, ఖర్చుల వివరాలను బోర్డుపై ప్రదర్శించనున్నారు. హిందూ ధార్మిక సంస్థలు, దేవదాయశాఖ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా 34,564 ఆలయాలు ఉన్నాయి. అన్ని గుడుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయదలిచారు. ఏ గ్రూప్‌లో 205, బి గ్రూప్‌లో 193, సి గ్రూప్‌లో 34,166 ఆలయాలు ఉన్నాయి. అన్ని దేవాలయాల ముందు డిసెంబరు లోగా బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దేవదాయశాఖ నిర్ణయం ప్రకారం ఇకపై ఏ గుడికి సంబంధించి ఎటువంటి ఆదాయమైనా ఖర్చులు పోగా మిగిలిన సొమ్ము అక్కడే అభివృద్ధికి ఖర్చు పెట్టనున్నారు. దేవాలయాల్లో నిబంధనలు, పరిశుభ్రత వివరాలను దేవదాయశాఖ అభివృద్ధి పనుల సమాచారాన్ని బోర్డులపై ప్రదర్శించనన్నారు.

తీవ్ర ఆరోపణలతోనే నిర్ణయం

ఆలయాల ఆదాయం వినియోగించే విషయంలో శాసనసభ సమావేశాలలో చర్చ జరిగిన విషయం తెలిసిందే. గ్రాంట్ల విడుదల జాబితాలో చర్చిలు, మసీదుల పేర్లు ప్రస్తావిస్తూ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని నిలదీసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత సోషల్‌మీడియాలోనూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్రమైన చర్చలు జరిగాయి. హిందువుల ఆలయాల సొమ్మును ఇతరమతాలకు వినియోగించడం సిగ్గుమాలిన చర్య అంటూ నిరంతరంగా ప్రభుత్వంపై పలు హిందూసంఘాలు నిరసన తెలిపాయి. సోషల్‌మీడియాలో ఇప్పటికీ విమర్శల పరంపర సాగుతూనే ఉంది. దీంతో దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి అధ్యక్షతన అధికారులు ధార్మిక దత్తి పరిషత్ సభలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఆలయం ముందు బోర్డు ప్రకటించే విషయానికి అంగీకరించారు.

ఆదాయం, ఖర్చు బహిరంగం

రానున్న రోజుల్లో ప్రతి ఆలయానికి సంబంధించి వార్షిక ఆదాయం, ఖర్చుల వివరాలను భక్తులకు తెలియజేయనున్నారు. దీంతో ఏ ఆలయానికి ఎంతమేర ఆదాయం వస్తుందనేదానికంటే ఎంత ఖర్చు చేస్తున్నారనేది కూడా బహిరంగం కానుంది. ఏ విధమైన ఖర్చులు ఉంటాయనేది తేటతెల్లం కానుంది. ఖర్చులు పోగా ఏడాదికి ఎంత మిగులు సాధ్యమవుతుందనేది తేలనుంది.

● రాష్ట్రంలో ఏటా రూ.25 లక్షల ఆదాయం కల్గిన ఆలయాలు ఏ గ్రేడ్ కింద నిర్ణయించారు. ఇటువంటివి 205 ఆయాలు ఉన్నాయి. రూ.5లక్షల నుంచి 25 లక్షల ఆదాయం కల్గిన ఆలయాలను బి గ్రేడ్ కింద పరిగణించారు. ఇవి 193 ఉన్నాయి. రూ.5లక్షల కంటే తక్కువ ఆదాయం కల్గిన ఆలయాలను సి గ్రూప్‌లోకి చేర్చగా 34,166 ఉన్నాయి.

ఈ మూడు కేటగిరి ఆలయాల ద్వారా 2020 నుంచి 2023 నవంబరు వరకు హుండీలతోపాటు వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1975.88 కోట్ల ఆదాయం వచ్చింది. దేవదాయశాఖకు అనుబంధమైన ఆలయాల ఆదాయం సంబంధిత ఆలయాల బ్యాంకు ఖాతాలలో జమ చేశారు. ఈ సొమ్మును దైనందిన పూజా కైంకర్యాలకు, నిత్య సేవలకు, సిబ్బంది వేతనాలు, భక్తులకు మౌలిక సదుపా యాలు కల్పించడం, జీర్ణోద్ధరణ వంటి ఖర్చులను కర్ణాటక హిందూ సంస్థలు, దేవదాయ దత్తి చట్టం 1997 కాలం 36 ప్రకారం ప్రాధికార నుంచి అనుమతులు ఆమోదం పొందిన తర్వాత ఖర్చు చేసే విధానం ఉంది.



ధర్మస్థల ఆలయం

భక్తుల విశ్వాసం కోసమే..

రాష్ట్రంలో హిందూ భక్తులకు విశ్వాసం కలిగించడానికే ప్రతి ఆలయం ముందు ఆదాయ, వ్యయాల బోర్డు ఏర్పాటు చేసే నిర్ణయం తీసుకున్నామని దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకే ఏ గుడి ఆదాయం ఆ గుడికే ఖర్చు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. కాగా రూ.10కోట్ల వ్యయంతో విధానసౌధ సమీపాన ధార్మికసౌధ నిర్మించనున్నట్టు తెలిపారు. దేవదాయ శాఖకు చెందిన ఆస్తులకు సంబంధించి త్వరలోనే సర్వే నిర్వహిస్తామని, ఒకవేళ ఆక్రమణకు గురైనట్టు గుర్తిస్తే వెంటనే తొలగిస్తామన్నారు. దేవదాయశాఖ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

కన్నడ సాహిత్య సమ్మేళనం అధ్యక్షుడిగా గొరు



బెంగళూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండ్యలో జరిగే 87వ అఖిలభారత కన్నడ సాహిత్యసమ్మేళనం అధ్యక్షుడిగా ప్రముఖ సాహితీవేత్త గొరు (గొండదహళ్ళి గిరి గౌడ్రు రుద్రప్ప) చన్నబసప్ప పేరు ఖరారు చేశారు. డిసెంబరు 20 నుంచి మూడు రోజులపాటు సాహిత్య సమ్మేళనం జరగనుంది. కన్నడ సాహిత్య పరిషత్‌లో బుధవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో చన్నబసప్ప పేరు ఖరారు చేసినట్టు కన్నడ సాహిత్యపరిషత్ అధ్యక్షుడు నాడోజ మహేశ్‌జోషి ప్రకటించారు. గొరు చన్నబసప్ప చిక్కమగళూరు జిల్లా అజ్జంపుర తాలూకా గొండేదహళ్ళిలో 1930 మే 18న జన్మించారు. కర్ణాటక ప్రగతిపథ, చెలువాంబిక, కునాల, సాక్షి కళ్ళు, బెళ్ళక్కి హిండు, బెదెయారో, బాగూరు నాగమ్మ, గ్రామ గీతెగళు, విభూతి వంటి రచనలు చేశారు. జానపద నిపుణులైన ఆయన కర్ణాటక జానపద అకాడమీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. దేశంలోనే తొలిసారిగా కర్ణాటక జానపద విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. కన్నడ సాహిత్య పరిషత్ కార్యదర్శిగా, అధ్యక్షుడిగాను రాణించారు. కాగా మండ్యలో 1974లో జయదేవితాయి అధ్యక్షతన తొలి సమ్మేళనం జరగ్గా 1994లో చతురంగ అధ్యక్షతన రెండో సమ్మేళనం జరిగింది.

14,082 బీపీఎల్ కార్డుల రద్దు

బళ్లారిలో 12,950, విజయనగర జిల్లాలో 1,132

దాదాపు మూడు వేల కార్డులు ఏపీఎల్‌గా మార్పు



బళ్లారి గాంధీనగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బీపీఎల్(బిలో పావర్టీ లైన్) రేషన్ కార్డుల ఏరివేతలో భాగంగా బళ్లారి, విజయనగర జిల్లాల్లో అనర్హులుగా గుర్తించి 14,082 మంది కార్డులు రద్దు చేశారు. బళ్లారి జిల్లాలో మొత్తం 12,950 మంది అనర్హులు బీపీఎల్ కార్డులు పొందినట్లు గుర్తించి, రద్దు చేసినట్లు ఆహార పౌరసరఫరా అధికారులు తెలిపారు. ఇందులో ఆదాయ పన్ను చెల్లించే కుటుంబాలు 1,772 ఉన్నాయని, వారి కార్డులను ఏపీఎల్‌గా మార్పు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'కుటుంబ' సాఫ్ట్‌వేర్ ఆధారంగా ఆదాయ పన్ను చెల్లింపు దారులు, ప్రభుత్వ ఉద్యోగులు, సంవత్సరా దాయం రూ. 1.2లక్షలకు పైబడిన వారిని అనర్హులుగా గుర్తించి, కార్డులు రద్దు చేసినట్లు తెలిపారు. బళ్లారి జిల్లాలో తాలూకా వారిగా పరిశీలిస్తే, బళ్లారి తాలూకా 5,431 మంది అనర్హులు వద్ద బీపీఎల్ కార్డులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 21 కార్డులు రద్దు చేయగా, మిగతా వాటి రద్దు ప్రక్రియ కొనసాగుతోంది. బళ్లారి గ్రామీణ ప్రాంతాల్లో 22 కార్డులు, కంప్లి 1,242 కార్డులు గుర్తించగా, వాటిలో ఇప్పటి వరకు 83 కార్డులు రద్దయ్యాయి. కురుగోడులో 348 కార్డులు, సండూరులో 2,775, సిరుగుప్ప 1,454 అనర్హుల వద్ద బీపీఎల్ కార్డులు ఉన్నట్లు తేలిందన్నారు. జిల్లాలో 71మంది ప్రభుత్వ ఉద్యోగులు బీపీఎల్ కార్డులు పొందగా, ప్రస్తుతం వాటిని ఏపీఎల్ కార్డుగా మార్పు చేసినట్లు తెలిపారు. బళ్లారి తాలూకాలో 30, బళ్లారి రూరల్ 6, కురుగోడు 3, సండూరు 14, సిరుగుప్పలో 13మంది ప్రభుత్వ ఉద్యోగుల వద్ద బీపీఎల్ కార్డులు ఉన్నట్లు ఆహార పౌరసరఫరా శాఖ గణాంకాలు చెబుతున్నాయి. 2012-2024 మధ్య కాలంలో 2,813మంది అనర్హుల వద్ద బీపీఎల్ కార్డులు ఉన్నట్లు గురించి వారి నుంచి జరిమానా వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో మృతి చెందిన వారిపేరుపై 3,576 కార్డులు ఉన్నట్లు గుర్తించి, రద్దు చేసినట్లు తెలిపారు. ఒక్క బళ్లారి నగరంలోనే 1,556 ఇలాంటి కార్డులను గుర్తించారు. కంప్లిలో 341, కురుగోడు 282,సండూరు 89, సిరుగుప్పలో 808 మృతిచెందిన వారిపై ఉన్న కార్డులు రద్దు చేశారు.

ఆరు నెలలు రేషన్ పొందని కార్డులు సస్పెన్షన్

జిల్లాలో బీపీఎల్ కార్డులు ఉన్న వారు వరుసగా ఆరు నెలల పాటు చౌకధరల ధాన్యం డిపోల నుంచి సరుకులు తీసుకోకపోతే వారి కార్డులు సస్పెండ్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాంటివి ఇప్పటి వరకు 7488 కార్డులను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. రేషన్ పొందక పోవడానికి సరైన కారణాలు చూపి ఆధారాలు అందజేస్తే సస్పెన్షన్ తొలగిస్తామని చెప్పారు.

విజయనగర జిల్లాలో 1132 బీపీఎల్ కార్డుల రద్దు

విజయనగర జిల్లాలో 1132 అనర్హుల కార్డులను రద్దు చేసినట్లు ఆహార పౌరసరఫరా అధికారులు పేర్కొన్నారు. ఆరు నెలలుగా రేషన్ పొందని 9,326 కార్డులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. వీరితో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న 101 మంది, ఆదాయ పన్ను చెల్లించే 1,031 మంది బీపీఎల్ కార్డులను ఏపీఎల్‌గా మార్చినట్లు తెలిపారు. సుమారు మూడు నెలల పాటు జిల్లాలో కార్డుల ఏరివేత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

14న బెంగళూరు మిడ్‌నైట్ మారథాన్



మీడియాతో మారథాన్ నిర్వాహకులు రితీశ్ బిండల్

బెంగళూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వైట్‌ఫీల్డ్ కేటీపీఓలో డిసెంబరు 14న 17వ బెంగళూరు మిడ్‌నైట్ మారథాన్ నిర్వహించనున్నట్టు మారథాన్ ఛైర్మన్ రితీశ్ బిండల్ ప్రకటించారు. ఈ ఏడాది పారా అథ్లెట్‌లకు గౌరవం కల్పించేలా కొత్త రేస్‌ను చేర్చినట్టు వెల్లడించారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఏషియన్ పారాగేమ్స్‌లో బంగారుపతకం సాధించిన అథ్లెట్ రక్షితరాజును ఈ కార్యక్రమానికి రాయబారిగా ఖరారు చేశామన్నారు. 31.6 కిలోమీటర్ల మేర కొత్త రేసు ఉంటుందని, ఈ ఏడాది సురక్షిత నగరం కోసం పరుగు అనే నినాదంతో మారథాన్ నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబరు 8వ తేదీతో రిజిస్ట్రేషన్ ముగుస్తుందన్నారు. ఈ మారథాన్‌లో 11వేలమంది పాల్గొంటారని అంచనా వేస్తున్నామన్నారు. రేస్ డైరెక్టర్ గుల్ మహ్మద్ అక్బర్ మహ్మద్ మాట్లాడుతూ 31.6 కిలోమీటర్ల పరుగుతో ప్రొఫెషనల్స్‌కు ఆసక్తి పెరుగుతుందన్నారు. 10కే, 5కే, టీకే5కేతోపాటు 31.6 కిలోమీటర్ల రన్‌లు ఉంటాయన్నారు. శనివారం సాయంత్రం 6 గంటలనుంచి మిడ్‌నైట్‌దాకా పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఫోన్‌పే బ్రాండ్ మార్కెటింగ్ డైరెక్టర్ రమేశ్ శ్రీనివాసన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

రంగుమారుతున్న తుంగభద్ర జలం

ఆందోళన చెందుతున్న రైతులు




తుంగభద్ర జలాశయంలో పచ్చరంగులోకి మారిన నీరు

కంప్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల జీవనాడి అయిన తుంగభద్ర జలాశయంలో నీరు రోజురోజుకు రంగు మారుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లో అల్పపీడనం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ఈ కలుషిత నీటి వల్ల రబీ పంటలో కూడా దెబ్బతింటాయేమోనని ఆందోళన చెందుతున్నారు. కొప్పాళ, విజయనగర, బళ్లారి, రాయచూరు జిల్లాలకు కూడా ఈ జలాశయం నుంచి తాగునీరు అందుతుంది. కలుషిత నీటి వల్ల ఎక్కడ అనారోగ్యానికి గురవుతామోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రైతు సంఘ నాయకులు సింధిగేరి గోవిందప్ప మాట్లాడుతూ జలాశయానికి పైభాగంలో ఉండే హరప్పనహళ్లి, హగరి బొమ్మనహళ్లి, తదితర ప్రాంతాల్లోని కర్మాగారాలు వ్యర్థ పదార్థాలను జలాశయంలోకి వదులుతుండటం వల్ల నీరు కలుషితమై పచ్చ రంగులోకి మారుతున్నాయన్నారు. దీని వల్ల ఇటు రైతులు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. అలాగే వేసవి సమయంలో కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ప్రజలు తాగునీటికి ఇబ్బందిపడే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి జలాశయంలో నీరు కలుషితం కాకుండా చూడాలని కోరారు. లేకపోతే జలాశయం ఎదుటనే నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

రూ. వెయ్యికోట్లు ఇచ్చినా బీజేపీలో చేరేది లేదు

● బెళగావి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆసిఫ్‌సేఠ్



బెంగళూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్‌లో 135మంది ఎమ్మెల్యేలు ఉన్నామని స్పష్టమైన మెజారిటీ ఉందని నాకు రూ.100 కోట్లు కాదు రూ.వెయ్యి కోట్లు ఇచ్చినా బీజేపీలో చేరేది లేదు' అని బెళగావి ఉత్తర కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆసిఫ్ సేఠ్ తెలిపారు. ఆయన బుధవారం బెళగావిలో మీడియాతో మాట్లాడుతూ గతంలో కొందరు ఆపరేషన్ కమలకు ఆకర్షింపబడ్డారని, ప్రస్తుతం ఐదుగురు ఎమ్మెల్యేలు కూడా వెళ్లరన్నారు. నాతోపాటు నా సోదరుడు మాజీ ఎమ్మెల్యే ఫిరోజ్‌సేఠ్ కొన్నేళ్లుగా కాంగ్రెస్‌లో ఉన్నామని, భవిష్యత్తులోనూ ఉంటామన్నారు. మాకు ఎలాంటి ఆఫర్ రాలేదన్నారు. వెయ్యి కోట్లు ఇస్తామన్నా చేరే ప్రసక్తి లేదన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి



ఐఐఎం వార్షికోత్సవ సంచిక విడుదలలో సీఎం సిద్దరామయ్య

- ఉత్సాహం చూపుతున్న పారిశ్రామికవేత్తలు
- వచ్చే ఏడాదికి ఆకర్షణలో దేశంలో రెండోస్థానం
- ఐఐఎం వార్షికోత్సవంలో సీఎం సిద్దరామయ్య



వివిధ సంస్థల ప్రతినిధులు

బెంగళూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు ఉత్సాహం చూపుతున్నారని సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో ప్రస్తుతం దేశంలో మూడోస్థానంలో ఉన్న కర్ణాటక త్వరలో రెండోస్థానానికి చేరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నగరంలోని జీకేవీకే ప్రాంగణంలో బుధవారం ఏర్పాటైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్ సంస్థ 78వ వార్షిక సాంకేతిక సమావేశాన్ని సీఎం లాంఛనంగా ప్రారంభించారు. సీఎంతో పాటు డీసీఎం డీకే శివకుమార్, భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ప్రస్తుతానికి రూ.54,427 కోట్లు పెట్టుబడుల దశలో ఉన్నాయన్నారు. రానున్న ఆరు నెలల్లో మరో రూ.19,059 కోట్లు పెట్టుబడులు రానున్నాయన్నారు. తద్వారా రాష్ట్రంలో రూ. 73వేల కోట్ల పెట్టుబడులతో 2025 జూన్‌నాటికి దేశంలోనే పెట్టుబడుల సాధనలో రెండో రాష్ట్రంగా నిలుస్తుందన్నారు. ఈ ఏడాది ఇప్పటికే రూ.46,375 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 27వేలమందికిపైగా ఉద్యోగ అవకాశాలు లభించాయ న్నారు. రాష్ట్రంలో సింగిల్‌విండో విధానంతో అనుమతులు మంజూరు చేస్తామ న్నారు. పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉండాలని 669 పారిశ్రామికవాడలకు అనుమతులు ఇచ్చామన్నారు. పరిశ్రమలతోపాటు పర్యావరణ సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. మెటల్స్ మెటీరియల్స్ సెక్టార్‌లలో పరిశోధనలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఐఎం ఛైర్మన్ సజ్జన్ జిందాల్, జిందాల్ సంస్థ ఛైర్మన్ వీకే మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రికే కన్నడరాదు

- వర్చువల్ కాన్ఫరెన్స్‌లో ఓ విద్యార్థి
- మండిపడ్డ మంత్రి.. చర్యలకు ఆదేశం



ఆన్‌లైన్ కోచింగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మధు బంగారప్ప

బెంగళూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యాశాఖ మంత్రికే కన్నడ భాష రాదని ఓ విద్యార్థి పేర్కొనడం సంచలనం కలిగిస్తోంది. ప్రభుత్వ పీయూ కళాశాల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత నీట్ కోచింగ్ ప్రారంభ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విధానసౌధ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిం ది. ఈ కార్యక్రమాన్ని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్పకు వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం వర్చువల్‌గా విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఇదే సందర్భంలోనే ఓ విద్యార్థి, విద్యాశాఖమంత్రి మధుబంగారప్పకే కన్నడ సరిగా రాదంటూ నవ్వారు. ఈ మాటలు ఆన్‌లైన్‌లో అందరి సమక్షంలో విన్న మంత్రి మధు బంగారప్ప తీవ్రంగా మండిపడ్డారు. అలా మాట్లాడిన వారెవరో తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాను కన్నడ మాట్లాడానా..? లేక ఉర్దూ మాట్లాడానా... అంటూ ప్రశ్నించారు. అతడెవరో తెలుసుకోండి. అతడిని ఊరికే వదలొద్దు అని విద్యాశాఖ ప్రిన్సిపల్‌సెక్రటరీ నితీశ్‌కుమార్‌ను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు ఆ విద్యార్థిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. కాగా ఓ విద్యార్థి కన్నడ రాలేదని ఆరోపిస్తే అతడిపై చర్యలు తీసుకోవాలనడం సమంజసం కాదని బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ మండిపడ్డారు. భాష రాకుంటే నేర్చుకోవాలిగానీ విద్యార్థిపై చర్యలంటే ఎంతవరకు సమంజసమని ఎమ్మెల్యే యత్నాళ్ ప్రశ్నించారు.

విక్రమ్‌గౌడది నకిలీ ఎన్‌కౌంటర్

న్యాయ విచారణతో వాస్తవాలు వెలుగులోకి

మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలి

మాజీ మావోయిస్టులు సిరిమనె నాగరాజ్, నూర్ శ్రీధర్

బెంగళూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉడుపి జిల్లా హెబ్రిలో జరిగిన విక్రమ్‌గౌడ ఎన్‌కౌంటర్ నకిలీది అని మాజీ మావోయిస్టులు సిరిమనె నాగరాజ్, నూర్ శ్రీధర్ మండిపడ్డారు. బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మానవహక్కుల పోరాటనేతలు నగరిగెరె రమేశ్, వెంకటేశ్, నాగేశ్ లతోపాటు ప్రొఫెసర్ శ్రీధర్‌తో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. నూర్ శ్రీధర్ మాట్లాడుతూ పదేళ్ల తర్వాత మలెనాడు ప్రాంతంలో ఎన్‌కౌంటర్ పేరుతో ఓ సామాన్య ఆదివాసీ యువకుడిని బలికొనడం విచారకరమన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్య అని ఆరోపించా రు. గడిచిన కొన్నేళ్లలో మావోయిస్టులు ఏ విధమైన దాడులు చేయలేదని, ఆస్తుల నష్టం గానీ ఎవరినీ హతమార్చిన సంఘటనలు లేవన్నారు. కనీసం మావో యిస్టుల పేరిట కరపత్రం కూడా వేయలేదన్నారు ఐదారుగురు మావోయిస్టుల్లో అందరూ అడవిలోకి పరారైతే మిగిలిన విక్రమ్‌గౌడను సుమారు 40మందికిపైగా ఉండే యాంటినక్సల్స్ ఫోర్స్ ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. పరస్పరం దాడులంటే నక్సల్స్ దాడులలో ఎవరికైనా దెబ్బలు తగిలాయా..? అని ప్రశ్నించారు. ఎన్‌కౌంటర్ తర్వాత మీడియాను సంఘటన స్థలానికి ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. ఇటీవల మలెనాడు ప్రాంతంలో కస్తూరిరంగ నివేదికను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, వాటిని అడ్డుకునేందుకే వ్యూహాత్మకంగా విక్రమ్‌గౌడను హతమార్చారన్నారు. మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలోకి వచ్చేందుకు సుముఖత చూపితే ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. ప్రొఫెసర్ శ్రీధర్ మాట్లాడుతూ ఎన్‌కౌంటర్‌పై పోలీసుల తీరు సరిగా లేదని, వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయ విచారణ ద్వారానే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. రాష్ట్రంలో ఎంతమంది మావోయిస్టులు ఉన్నారన్న సమాచారం లేదన్నారు. ఎన్‌కౌంటర్ రక్తపు మరక సీఎం సిద్దరామయ్య దుస్తులకు అంటుకుందన్నారు. ఇటువంటి హత్యలతో ఉద్యమాలను ఆపుదామనుకోవడం సరికాదన్నారు.



మీడియాతో ప్రొఫెసర్ నూర్ శ్రీధర్, సమావేశంలో సిరిమనె నాగరాజ్, నగరిగెరె రమేశ్

26న ధర్నాకు తరలిరండి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



జీపుజాతాలో మాట్లాడుతున్న ఓబులు

కళ్యాణదుర్గం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు తరలి రావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం పట్టణంలోని బాబూజగ్జీవన్‌రామ్ సర్కిల్ వద్ద నిర్వహించిన జీపు జాతాలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, విద్యుత్ సవరణ బిల్లు-2022ను రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లు, గృహ వినియోగానికి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఆపాలని, రైతుల రుణమాఫీ చేయాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ ఇతర సంఘాల నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, శ్రీరామిరెడ్డి, వన్నూరుస్వామి, పాతక్క, రంగనాథ్, రఘు, నరేష్ పాల్గొన్నారు.


రైతు ఉత్పత్తులకు సొసైటీల సహకారం

జిల్లా సహకార శాఖాధికారి అరుణకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహకార శాఖాధికారి అరుణకుమారి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు పండించే పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, సకాలంలో విక్రయించడానికి సహకార సొసైటీలు ఎంతగానో తోడ్పడుతున్నాయని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమామారి పేర్కొన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు సభ బుధవారం స్థానిక రామ్‌నగర్ లోని రాయలసీమ సహకార శిక్షణా కేంద్రంలో నిర్వహించారు. 'స్థిరమైన అభి వృద్ధి లక్ష్యాల సాధనలో, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సును ఉద్దేశించి డీసీఓ మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు చిన్నస్థాయి రైతులు, మత్స్యకారులు, ఉత్పత్తిదారులకు అవసరమైన మార్కెట్ సదుపాయం కల్పిస్తాయని అన్నారు. రైతులకు పంటల దిగుబడి పెంచడం, పెట్టుబడి తగ్గించడం, మౌళిక వసతులు కల్పించడంలో, ప్రజలకు ఆహారభద్రత పెంచడంలో సొసైటీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అర్బన్‌బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ మాట్లాడుతూ సహకార వ్యవస్థ ఆవిర్భావం తెలియజేస్తూ మార్పులు చేర్పులను వివరించారు. ప్రస్తుతం అర్బన్‌బ్యాంకు నాలుగు బ్రాంచ్‌లు ద్వారా సేవలు అందిస్తున్నామని, మరో ఆరు బ్రాంచ్‌ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, డీఎల్‌సీఓ ప్రభాకర్‌రెడ్డి, విశ్రాంత సీఈఓ నరసింహారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు నాగవీణ, మేధిని, సహకార విద్యాధికారి మురళీమోహన్ పాల్గొన్నారు.



బోర్డుకే పరిమితమైన శింగనమల మార్కెట్ యార్డు

మార్కెట్ యార్డులు ఏవీ..?

- బోర్డుకే పరిమితమైన శింగనమల
- స్థల కేటాయింపు లేని రాప్తాడు
- వైసీపీ హయాంలో ఆర్భాటంగా జీవోలు



నిధులు మంజూరు చేయాలి

శింగనమల మార్కెట్ యార్డుకు స్థలం కేటాయించారు. దిష్టిబొమ్మలాగా బోర్డు ఏర్పాటు చేశారు తప్ప ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. రైతుల అవసరాల దృష్ట్యా వెంటనే మార్కెట్ యార్డుకు నిధులు మంజూరు చేసే విధంగా ఎమ్మెల్యే చొరవ చూపాలి.

- నారాయణస్వామి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి



బుక్కరాయసముద్రం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి ఒక మార్కెట్ యార్డు అంటూ గత వైసీపీ ప్రభుత్వం చేసిన ఆర్భాటపు ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. తమ పార్టీ నాయకులకు నామినేటెడ్ పదవులు పంపకం కోసమే అన్నట్లుగా తయారయింది. ప్రతి నియోజకవర్గంలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తున్నట్లు జీవో జారీ చేసింది. రైతులు కూడా తాము పండించిన పంటలను సమీపంలోనే విక్రయించుకోవచ్చని ఆశించారు. కానీ ఎక్కడా వాటికి భవనాలు నిర్మించలేదు. అనంతపురం జిల్లాలో గతంలో అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి, ఉరవకొండలో మార్కెట్ యార్డులు ఉండేవి. ప్రతి నియోజక వర్గానికి ఒక మార్కెట్ యార్డు ప్రకటనలో భాగంగా 2021లో వైసీపీ ప్రభుత్వం శింగనమల, రాప్తాడు నియోజక వర్గాలకు కమిటీలు ఏర్పాటు చేసింది. శింగనమల నియోజకవర్గం మార్కెట్ యార్డు కోసం బుక్కరాయసముద్రం మండలంలోని జంతులూరు వద్ద ఓపెన్ ఎయిర్ జైలుకు సంబంధించిన స్థలంలో 10 ఎకరాలు కేటాయించారు. బోర్డు పెట్టి భూమి పూజ చేసి వదిలేశారు. ఇప్పటి వరకు ఆ స్థలంలో ఒక్క ఇటుక పెళ్ల కూడా వేయలేదు. నూతన భవనాలు, గోడౌన్లు తదితర అభివృద్ధి పనులకు రూ.3.75 కోట్లతో అంచనాలు వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. 2021లో నివేదికలు పంపినా ఇంత వరకు నిధులు మంజూరు కాలేదు. రాప్తాడు నియోజకవర్గంలో మార్కెట్ యార్డు పేరుకే ఉంది. కనీసం స్థలం కూడా కేటాయించ లేదు. గతంలో రాప్తాడు, సీకేపల్లి మండలాల్లోని జాతీయ రహదారి పక్కన 10 ఎకరాలు స్థలం కోసం పలు చోట్ల చూశారు. ఎక్కడా అనువైన భూములు లేకపోవడంతో స్థల కేటాయింపు జరగలేదు. రాప్తాడు నియోజకవర్గంలో ఉన్న టమాటా మార్కెట్‌లో భారీ స్థాయిలో విక్రయాలు జరుగుతున్నాయి. కక్కలపల్లి రహదారిలో ప్రైవేటు స్థలాల్లో మార్కెట్ ఏర్పాటు చేసుకుని క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. పుట్టపర్తి మార్కెట్ యార్డుకు స్థలం కేటాయించలేదు. కొత్తచెరువులో సబ్ మార్కెట్ యార్డుగా ఉన్న దానినే కొనసాగిస్తున్నారు. అదనంగా గోరంట్ల మార్కెట్ యార్డు కేటాయించారు.

యార్డు లేక తీవ్ర ఇబ్బందులు



శింగనమల నియోజకవర్గంలో మార్కెట్ యార్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తున్నట్లు నాలుగు సంవత్సరాల క్రితం ప్రభుత్వం చెప్పింది. ఈ ప్రభుత్వ హయాంలోనయినా నిధులు మంజూరు చేసి భవనాలు, గోడౌన్ల నిర్మాణం చేపట్టాలి.

- గోపాల్‌నాయుడు, రైతు, జంతులూరు

భవన నిర్మాణాలకు అంచనాలు వేస్తున్నాం

శింగనమల మార్కెట్ యార్డు భవన నిర్మాణాలకు అంచనాలు వేస్తున్నాం. రూ.4.75 కోట్లతో అంచనాలు వేసినట్లు డీఈ, జేఈ తెలిపారు. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తాం. రాప్తాడు నియోజకవర్గానికి ఇప్పటి వరకు స్థలం దొరకలేదు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. యార్డుకు స్థలం దొరికిన వెంటనే అంచనాలతో ప్రభుత్వానికి నివేదిక పంపుతాం.

- సత్యనారాయణచౌదరి, ఏడీ, మార్కెట్ యార్డు

త్వరగా నిర్మాణం చేపట్టాలి



రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో వెంటనే మార్కెట్ యార్డు నిర్మాణం చేపట్టాలి. గతంలో వైసీపీ చేసిన నిర్లక్ష్యమే కూటమి ప్రభుత్వం చేస్తోంది. నిర్మాణం కోసం వెంటనే నిధులు మంజూరు చేయాలి. రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలి.

- నల్లప్ప, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు

జాకీ పరిశ్రమను మళ్లీ తీసుకురండి

అసెంబ్లీలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

మంత్రులకు వినతిపత్రాలు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాప్తాడులో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి కమీషన్ల బెదిరింపులతో తరలిపోయిన జాకీ పరిశ్రమను తిరిగి అదే ప్రాంతంలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషితో జాకీ సంస్థ రాప్తాడు సమీపంలో పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందన్నారు. 2017లో పరిశ్రమ ఏర్పాటు కోసం ఏపీఐఐసీ ద్వారా 27 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని గుర్తు చేశారు. రూ.129 కోట్ల పెట్టుబడితో ఏడాదికి 32.4 మిలియన్ల దుస్తులను తయారు చేసే పరిశ్రమ పనులను 2018లోనే ప్రారంభించారని తెలిపారు. ప్రహరీ నిర్మాణం పూర్తి చేసి పరిశ్రమకు సంబంధించిన సామగ్రిని ఇక్కడికి తరలించే సమయంలో వైసీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ సమయంలో అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, అతడి సోదరులు పరిశ్రమ యాజమాన్యం నుంచి రూ. 15 కోట్లు డిమాండ్ చేశారన్నారు. దీంతో పరిశ్రమ తెలంగాణకు తరలిపోయిందన్నారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి కల్పించే అవకాశం కోల్పోయిందన్నారు. జాకీ పరిశ్రమను ప్రారంభించాలని టీడీపీతో పాటు సీపీఐ నాయకులు చలో జాకీ పరిశ్రమ కార్యక్రమాన్ని నిర్వహిస్తే.. ప్రకాశ్‌రెడ్డి ఆదేశాలతో 40 మంది నాయకులపై అక్రమంగా కేసులు పెట్టించారన్నారు. ఇందులో తనతో పాటు తన కుమారుడు పరిటాల శ్రీరామ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణలు ఉన్నారన్నారు. ఇతర గార్మెంట్స్ పరిశ్రమలు తీసుకొస్తామని ప్రగల్భాలు పలికిన నాటి ఎమ్మెల్యే ఏ ఒక్క పరిశ్రమను తీసుకురాలేదన్నారు. కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన ప్రోత్సహకాలు కొనసాగిస్తూ జాకీ పరిశ్రమను తిరిగి వచ్చేలా చూడాలన్నారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు చాంబర్లో ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌లు భారీ, చిన్న తరహా పరిశ్రమల శాఖల మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్‌ను కలిశారు. జాకీ పరిశ్రమను తిరిగి తీసుకురావాలని వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై మంత్రులు స్పందిస్తూ ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్

పోటీలకు ఎంపిక



అనిల్



పావని

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌస్‌మెహిద్దీన్, వెంకటేశులు, గౌరవాధ్యక్షుడు ఈశ్వరయ్య తెలిపారు. కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన టి.అనిల్ ఆర్ట్స్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతూ బాల్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్నాడు. ఇటీవల నంద్యాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మెరుగైన ప్రతిభతో మహారాష్ట్రలో నిర్వహించే జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. అదేవిధంగా ధర్మవరానికి చెందిన పావని జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఇదివరకే రాజశేఖర్, శ్రీనాథ్ జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా నుంచి ఈ ఏడాదిలో నలుగురు క్రీడాకారులు జాతీయ పోటీలకు అర్హత సాధించడం శుభసూచికమని వారు అభినందనలు తెలిపారు.

వచ్చే నెలలో సాగునీటి సంఘాల ఎన్నికలు



ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్లు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలకు డిసెంబరు మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు హెచ్చెల్సీ మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈలు రాజశేఖర్, విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికలపై బుధవారం సాయంత్రం స్థానిక జడ్పీలోని డీపీఆర్‌సీ భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95, హెచ్చెల్సీ పరిధిలో 54 సాగునీటి సంఘాలు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా సాగునీటి సంఘాల పరిధిలోని ఆయకట్టు రైతుల ఓటర్ల జాబితాలను ఆయా మండలాలు, గ్రామ పంచాయతీ పరిధిలో ప్రదర్శించామని తెలిపారు. ఇప్పటికే అభ్యంతరాలు కూడా అందజేశారని, అందుకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేశామన్నారు. డిసెంబరు మొదటి వారంలో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు, నిర్వహణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు వెంకటరమణారెడ్డి, రాజ్‌కుమార్, ఇంజనీర్లు, ఎన్నికల అధికారులు, సహాయాధికారులు, పోలింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రక్షణ కవచం పంటల బీమా

విస్తృతంగా అవగాహన కల్పించాలి: కలెక్టర్ వినోద్‌కుమార్



పంటల బీమా చేయండి.. రక్షణ కవచం పొందండి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులకు పంటల బీమా రక్షణ కవచం లాంటిందని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో పంటల బీమాపై జిల్లా స్థాయి పర్యవేక్షణా కమిటీ (డీఎల్ఎంసీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రబీ సీజన్‌కు సంబంధించి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాన్, కరువు, అకాల వర్షం తదితర ప్రకృతి వైపరీత్యాల మూలంగా పంట దిగుబడి నష్టపోతే ఆర్థికసాయం అందుతుందని వివరించారు. వాతావరణ ఆధారిత బీమాకు సంబంధించి మామిడి పంటకు ఎకరాకు రైతు వాటా రూ.1650 చెల్లిస్తే రూ.33వేల బీమాను వర్తింపజేస్తారన్నారు. టమోటా పంటకు ఎకరాకు రూ.1600 చెలిస్తే రూ.32వేల బీమాను వస్తుందన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దిగుబడి ఆధారిత బీమాకు వేరుశనగకు ఎకరాకు రూ.480 చెల్లిస్తే రూ.32వేల బీమా, జొన్నకు రూ.315 చెల్లిస్తే రూ.21వేలు, మొక్కజొన్నకు రూ.525 చెల్లిస్తే రూ.35వేలు, వరికి రూ.630 చెల్లిస్తే రూ.42వేలు, పప్పుశనగకు ఎకరాకు రూ.450 చెల్లిస్తే రూ.30వేల బీమా మొత్తాన్ని చెల్లిస్తారని వివరించారు. అనంతరం పంటల బీమా చేయండి.. రక్షణ కవచం పొందండి, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, సీపీఓ అశోక్‌కుమార్, డీహెచ్‌ఓ నరసింహారావు, డీపీఎం నాగరాజునాయుడు, ఎల్‌డీఎం నర్సింగరావు, ఎస్‌బీసీ డీఐఓ రవిశంకర్, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ అధికారి దాసు, ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ స్టేట్ ప్రెసిడెంట్ ప్రశాంత్, జిల్లా మేనేజర్ నరసింహమూర్తి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పంటల్లో పండు ఈగ నివారణపై నేడు శిక్షణ

అనంతపురం అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల్లో పండు పక్వానికి వచ్చే సమయంలో పంట దిగుబడిని తగ్గించే పండుఈగ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యాన పంటలను విదేశాలకు ఎగుమతి చేయడంపైనా చర్చిస్తామన్నారు. శిక్షణకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఉద్యాన అధికారులు, రైతులు హాజరుకావాలని సూచించారు.

కార్యదర్శులు అప్‌డేట్ చేసుకోవాలి: డీపీఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు స్వర్ణ పంచాయతీ పోర్టల్లో తమ ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేసుకోవాలని డీపీఓ నాగరాజనాయుడు ఆదేశించారు. బుధవారం డీపీఓ చాంబర్‌లో డీఎల్‌పీఓ సుమనజయంతితో కలిసి అనంతపురం రూరల్ మండలంలోని కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు శాఖాపరమైన అంశాలపై చర్చించారు. ఇంటి పన్నుకు సంబంధించి వందశాతం వసూళ్లు చేపట్టేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులందరికి సమాచారం చేరవేయాలని ఈఓఆర్డీలను ఆదేశించారు. సమావేశంలో ఈఓఆర్డీ వెంకటనాయుడు, కార్యదర్శులు అశోక్‌బాబు, శ్రీధర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ కూలీ మృతిచెందాడు. కక్కలపల్లి కాలనీకి చెందిన ఎర్రిస్వామి(43) అమరావతి సీడ్స్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈనెల 16న టవర్‌క్లాక్ బ్రిడ్జిపై వెళ్తుండగా ఆటో ఢీకొంది. దీంతో తీవ్రగాయాలకు గురైన అతన్ని బెంగుళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు గొలుసు దొంగల అరెస్టు

53 గ్రాముల బంగారం, వాహనాలు స్వాధీనం

చిత్తూరు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులను అపహరించే కర్ణాటకకు చెందిన ముఠాను చిత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 53 గ్రాముల బంగారం, ఓ కారు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను బుధవారం ఏఎస్పీ రాజశేఖరబాబు, డీఎస్పీ సాయినాథ్, క్రైమ్ పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ మణికంఠ చిత్తూరులో మీడియాకు వివరించారు.కేసును ఛేదించిన పోలీసులకు ప్రశంసాపత్రాలను అందజేశా రు. ఎస్పీ కథనం మేరకు.. గత నెల 26వ తేదీన పూతలపట్టు, ఐరాల మండలాల పరిధిలో 15 నిమిషాల వ్యవధిలో మూడు దొంగతనాలు జరిగాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, తమిళనాడుకు కూడా వెళ్లి దొంగల ముఠా గురించి వివరాలను సేకరించారు. ఈ క్రమంలో తిరుపతి- బెంగళూరు జాతీయ రహదారిలోని పలమనేరు మండలం జగమర్ల క్రాస్ వద్ద కర్ణాటక రాష్ట్రం, రామ్‌నగర జిల్లా కనకపుర తాలూకా ముళ్లహల్లి గ్రామానికి చెందిన శివకుమార్(36), చంద్రశేఖర్(40), జేపీనగర్‌కు చెందిన సయ్యద్ రేహాన్(19), బన్‌శంకరిలోని కనకపుర మెయిన్ రోడ్డుకు చెందిన కుమార్(19)లను అదుపులోకి తీసుకున్నారు.మరో నిందితుడైన పరశురామ్‌ను కర్ణాటక రాష్ట్రం దొడ్డబల్లాపూర్‌కు చెందిన పోలీసులు అరెస్టు చేశారు.ఈ సమావేశంలో ఎస్‌బీ సీఐ భాస్కర్, క్రైమ్ సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్‌బీ ఎస్ఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆ నలుగురి అరెస్టు వెనుక..

చిత్తూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళల మెడలో నుంచి బంగారు గొలుసుల్ని దొంగలించే నలుగురిని పోలీసులు అరెస్టు చేయడం వెనుక 20 రోజుల శ్రమ దాగి ఉంది. నిందితుల్లో ఏ1 శివకుమార్ పీజీ కంప్యూటర్స్ చదివాడు.పోలీసులను మించిన సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండడంతో పట్టుకోవడం పోలీసులకు కష్టంగా మారింది. చిత్తూరు- పీలేరు ప్రధాన రహదారిపై అక్టోబరు 26వ తేదీన 15 నిమిషాల వ్యవధిలో మూడు దొంగతనాలు జరిగాయి. ఓ మహిళ మెడలో నుంచి చైను లాగే ప్రయత్నంలో ఆమె కింద పడి, ఆ తర్వాత చికిత్స పొందుతూ మరణించింది కూడా. వరుస దొంగతనాలు, మహిళ మృతి.. పోలీసులకు ఓ రకంగా అవమానకరంగా మారింది. దీంతో స్పెషల్ బ్రాంచి, క్రైమ్ పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి అక్టోబరు 30 నుంచి నిందితుల్ని వెతకడం ప్రారంభించారు. మూడు దొంగతనాలూ చేసింది బైకులో యువకులు. ఎక్కడా ప్రధాన నిందితుడు శివకుమార్ కనిపించలేదు. కానీ, ఆ బైకు వెనుక ఓ కారు ప్రతిసారీ ఫాలో అవుతోంది. పూతలపట్టు నుంచి మన రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన నంగిలి వరకు చూసిన సీసీ కెమెరాల్లో ఆ బైకు వెంట ఓ కారు ఫాలో అవుతున్న విషయాన్ని గమనించిన పోలీసులు.. ఆ కోణంలో ఆరా తీశారు. టెక్నికల్ అనాలసిస్ లో శివకుమార్ ఆరేళ్లుగా పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్నాడని కర్ణాటక పోలీసులు చెప్పారు.

- ఆరేళ్లుగా దొరకని శివకుమార్

ప్రధాన నిందితుడు శివకుమార్ సొంతూరు.. కర్ణాటక రాష్ట్రం, రామ్‌నగర జిల్లా కనకపుర తాలూకా ముళ్లహల్లి గ్రామం. అది అటవీ ప్రాంతంలో ఉండడంతో ఈ ప్రాంతానికి పోలీసులు వెళితే శివకుమార్‌కున్న నెట్‌వర్క్ వల్ల ముందుగానే తెలిసిపోతోంది.ఇతనిపై దక్షిణాది రాష్ట్రాల్లో 40 వరకు కేసులున్నాయి. 22 కేసుల్లో అరెస్టు పెండింగు ఉంది. ఆరేళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారాన్ని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల పోలీసులు ఛేదించలేకపోయారు.శివకుమార్ 18ఏళ్ల యువకుల్ని పట్టుకుని వారికి మొదట గంజాయి అలవాటు చేస్తాడు. స్పోర్ట్స్ బైకుల్ని దొంగలించడం, వాటిపై వేగంగా వెళుతూ మహిళల మెడలో చైన్లను లాక్కెళ్లడం.. అంశాల్లో శిక్షణ ఇస్తాడు. దొంగతనం జరిగే ప్రదేశంలో తను లేకుండా చూసుకుంటాడు.శిక్షణ ఇచ్చిన యువకులు ముందు బైకులో వెళుతుండగా వెనుక కారులో ప్రయాణిస్తూ శివకుమార్ వారికి డైరెక్షన్ ఇస్తుంటాడు.కాబట్టే ఏ సీసీ కెమెరాలోనూ కన్పించడు.

- రెండు సార్లు తప్పించుకున్న వైనం

చిత్తూరు పోలీసులు సుమారు 20 రోజులు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో శివకుమార్ కోసం గాలించారు. శివకుమార్ ఓ రోజు పడుకున్న ప్రదేశంలో మరో రోజు పడుకోడు. రాత్రిళ్లు పడుకోవడానికి గదులు అద్దెకు తీసుకోడు. గ్రామీణ ప్రాంతాల్లోనే తల దాచుకుంటాడు.సెల్‌ఫోన్ వాడడు. బ్యాంకు అకౌంట్లు, సోషల్ మీడియా అకౌంట్లు లేవు. టోల్‌గేట్లను తప్పించుకుని ప్రయాణిస్తూ ఉంటాడు. చిత్తూరు పోలీసుల బృందానికి రెండుసార్లు శివకుమార్ కనిపించినా.. వేగంగా కారు డ్రైవ్ చేసి తప్పించుకున్నాడు.

- అష్టకష్టాలు పడిన పోలీసులు


శివకుమార్‌ను పట్టుకోవడానికి వెళ్లిన స్పెషల్ బ్రాంచి బృందంలో సీఐ భాస్కర్, ఎస్ఐ అనిల్‌కుమార్, కానిస్టేబుళ్లు వేణు, రవి, క్రాంతి, నటరాజ్, సుబ్రమణ్యం.. క్రైమ్ బృందంలో సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ నరసింహులు, కానిస్టేబుళ్లు గురురాజ్, గణేష్, పురుషోత్తం, స్రవంత్ ఉన్నారు. వీళ్లంతా అక్టోబరు 30 నుంచి నవంబరు 19 వరకు హోసూరు, మైసూరు, బెంగళూరు, దొడ్డబల్లాపూర్, ధర్మపురి, సేలం ప్రాంతాల్లో.. కొన్నిసార్లు వేర్వేరుగా, మరికొన్నిసార్లు కలిసి తిరిగారు.చివరకు నిందితుడి సొంతూరు ముళ్లహల్లి గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో పాడుబడిన గెస్ట్‌హౌసులో మకాం వేశారు. సుమారు వారం రోజుల పాటు అక్కడే ఉండి వండుకుని తింటూ.. అక్కడి కదలికల్ని గమనించేవారు. శివకుమార్ కోసం రాత్రిళ్లు విడతల వారీగా మేల్కొని ఉన్నారు. అతన్ని అరెస్టు చేసే 48 గంటల ముందుగా పోలీసు బృందాల్లో ఎవ్వరికీ నిద్ర లేదు. ఎస్ఐ అనిల్‌కుమార్ గుండె నొప్పితో.. మరో పోలీసు దగ్గు, జలుబుతో ఇబ్బంది పడ్డారు. చివరకు శివకుమార్ సహా, అతని బ్యాచ్ ముగ్గుర్నీ అరెస్టు చేశారు. బుధవారం ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. చిత్తూరు పోలీసులు ఇచ్చిన సమాచారంతో మైసూరు జిల్లా పోలీసులు ఐదవ నిందితుడు అబ్బు అలియాస్ పరశురామ్‌ను అరెస్టు చేశారు. అక్కడి పోలీసుల అనుమతితో చిత్తూరు పోలీసులు విచారణ కోసం తీసుకురానున్నారు.

- పొరుగు రాష్ట్రాల ఎస్పీల ప్రశంసలు

కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో కేసులున్నా.. ఆరేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న శివకుమార్‌ను చిత్తూరు పోలీసులు పట్టుకోవడంపై ప్రశంసలు లభించాయి. ఆ రెండు రాష్ట్రాల్లోని రామ్‌నగర, మైసూరు, హోసూరు, బెంగళూరు రూరల్ ఎస్పీలు చిత్తూరు ఎస్పీ మణికంఠకు ఫోన్ చేసి ప్రశంసించారు. రిమాండు ముగిసిన తరువాత తమకు అప్పగిస్తే.. మా కేసుల్లో మళ్లీ అరెస్టు చేసుకుంటామని చెప్పారు.

మహిళపై టీడీపీ నాయకుల దాడి

సోషల్ మీడియాలో వైరల్.. నలుగురిపై కేసు నమోదు



మహిళపై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు

పుట్టపర్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు లో మహిళపై టీడీపీ నాయకులు దాడిచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొత్తచెరువులోని నెహ్రూ కాలనీలో సిమెంటు రోడ్డు మంజూరైంది. కాలనీలోని నెమలి పార్వతమ్మ ఇంటి వద్ద రోడ్డు నిర్మాణానికి మెట్లు, డ్రైనేజీ గుంత అడ్డు వచ్చాయి. ఆక్రమణలు తొలగించుకోవాలని ఆమెకు అధికారులు సూచించారు. ఆమె ససేమిరా అనడంతో ఈనెల 19న టీడీపీ నేతలు వెళ్లి తొలగించుకోవాలన్నారు. అమె ససేమిరా అనడంతో టీడీపీ నాయకులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించే పనులు చేపట్టారు. పార్వతమ్మ అడ్డుకుంది. టీడీపీ నాయకులు.. ఆమెను పక్కకు నెట్టేసే క్రమంలో వాగ్వాదం తలెత్తింది. ఈ సందర్భంలో తనపైకే దాడి కొస్తావా అంటూ పార్వతమ్మను టీడీపీ నాయకులు కొట్టారు. ఈఘటనపై వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా బుధవారం పోస్టు పెట్టారు. అది వైరలైంది. తనపై టీడీపీ నాయకులు దాడి చేసినట్లు పార్వతమ్మ కొత్తచెరువు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో టీడీపీ నాయకుడు శ్రీనివాసులు, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. పార్వతమ్మపై టీడీపీ నాయకులు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

పేదలు ఇళ్లు కట్టుకోవాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గుత్తి రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని అధికారులకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమారు సూచించారు. జక్కలచెరువులో బుధవారం లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. సొంతిల్లు లేని ప్రతిఒక్కరూ ఇల్లు కట్టుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 65 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. అందులో 30 పూర్తయ్యాయని, మిగిలినవారు నిర్మించుకోవాలని సూచించారు. ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందిస్తుందని తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ శైలజ, ఎంపీపీ విశాలాక్షి, టీడీపీ నాయకులు ఈశ్వర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయమ్...

సర్ సీవీ రామన్ (వర్ధంతి)



భారతరత్న గ్రహీత 'సర్' చంద్రశేఖర్ వేంకట రామన్ (సీవీ రామన్) 1888 నవంబరు 7న తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి (ట్రిచీ, తిరుచ్చి) సమీపాన అయ్యన్ పెటాయ్ గ్రామంలో జన్మించారు. మెట్రిక్యులేషన్‌లో ఫిజిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించారు. ఎంఎస్సీ ఫిజిక్స్‌లో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు. కాంతి తరంగాలపై ఆయన చేసిన పరిశోధన 'రామన్ ఎఫెక్ట్'గా పేరొందింది. 'రామన్ ఎఫెక్ట్' ఆవిష్కరించిన ఫిబ్రవరి 28ని జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించారు. రాజగోపాలాచారి, సర్వేపల్లి రాధాకృష్ణన్‌లతో కలసి అందుకున్న తొలి 'భారతరత్న'. అంతేకాక సైన్స్‌లో నోబెల్ ప్రైజ్ అందుకున్న తొలి ఆసియా శాస్త్రవేత్తగా నిలిచారు. బెంగళూరులోని ఐఐఎస్‌సీకి తొలి డైరెక్టర్‌గా వ్యవహరించిన ఘనత ఆయనది. ఫిజిక్స్‌లో ఎన్నో పరిశోధనలు చేసి పలు గౌరవాలు పొందిన ఆయన 1970 నవంబరు 21న కన్నుమూశారు.

ఆనంది బెన్ (పుట్టినరోజు)



ఉత్తరప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌గా వ్యవహరిస్తున్న ఆనందిబెన్ మఫత్‌భాయ్ పటేల్ 1941 నవంబరు 21న గుజరాత్ రాష్ట్రం మెహ్సానా జిల్లా విజాపూర్ తాలూకా ఖరోడ్ గ్రామంలో జన్మించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి ఇన్‌చార్జ్ గవర్నర్‌గా వ్యవహరించారు. గుజరాత్ రాష్ట్ర తొలి మహిళా సీఎంగా వ్యవహరించిన ఘనత ఆమెది. గుజరాత్‌లో ఉత్తమ టీచర్‌గా గవర్నర్, ప్రెసిడెంట్స్ బ్రేవరీ అవార్డు అందుకున్నారు. ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి బీజేపీలో చేరి రాజకీయాల్లో రాణించారు. 1994లో రాజ్యసభ సభ్యురాలిగా చేరారు. ఆ తర్వాత ఎమ్మెల్యేగా కూడా గెలుపొందారు. 2014లో వందమందిలో అత్యంత ప్రభావశీలురులో ఒకరిగా నిలిచారు. విద్యా గౌరవ్, సర్దార్‌పటేల్ అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు.

అప్పులబాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య

పరిగి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అప్పుల ఉరికి మరో నేతన్న వేలాడాడు. మండలంలోని పెద్దరెడ్డిపల్లికి చెందిన చేనేత కార్మికుడు ఆదినారాయణ(44) అప్పుల బాధ భరించలేక బుధవారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరేసుకుని, మరణించాడు. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదినారాయణ కూలి మగ్గం పనులకు వెళ్తుండేవాడు. పనులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. కుటుంబ పోషణకు కొంతమేర అప్పులు చేశాడు. ఇద్దరు కుమార్తెలకు మరింత చేశాడు. దీంతో మొత్తం అప్పు రూ.8లక్షలు దాటింది. దానిని ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపం చెందిన అతడు బుధవారం తెల్లవారుజామున తన ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కాసేపటికి గమనించిన కుటుంబీకులు అతడిని కిందకు దించారు. అప్పటికే అతడు మరణించాడు. ఆదినారాయణ భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు జమేదార్ శ్రీనివాసులు తెలిపారు. ఆదినారాయణకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అన్నా, వదినలు వేరు కాపురం పెట్టడానికి తనే కారణమంటున్నారని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతపురంలోని భవానీనగర్‌కు చెందిన దుర్గప్పకు ఇద్దరు కుమారులు దేవరకొండ చంద్రశేఖర్, కార్తీక్ ఉన్నారు. కార్తీక్ (24) ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. అన్న, వదినలు వేరు కాపురం పెట్టారు. వారు వేరు కాపురం పెట్టడానికి తమ్ముడే కారణమని చుట్టుపక్కల వారు అంటున్నట్లు విన్నాడు. దీనికి తోడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఉరి వేసుకుని మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆస్తి పంపకాల విషయంలో ఓ వ్యక్తి అలక వహించి ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. నగర శివారులోని ఏఎస్‌ఆర్ నగర్‌కు చెంది నజీర్ సోదరుల మధ్య ఆస్తి వివాదం నెలకొంది. ఈ క్రమంలో బుధవారం ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. భార్య షేకుం నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గ్రామసభకు అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

దొమ్మసంద్ర, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దొమ్మసంద్ర గ్రామపంచాయతీ 2024-25 వార్షిక తొలి గ్రామసభకు అధికారులు గైర్హాజరు కావడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఏర్పాటైన గ్రామసభలో పలు అంశాలు ప్రస్తావించాలని భావించారు. దొమ్మసంద్ర గ్రామంలో 200 బీపీఎల్ కార్డుల రద్దు కావడంపై ప్రధానంగా చర్చించాలని భావించారు. అయితే సంబంధిత అధికారులు గ్రామసభలో పాల్గొనకపోవడంపై గ్రామస్థులు మండిపడ్డారు. 85ఏళ్ల రామక్కకు బీపీఎల్ కార్డు ఏపీఎల్‌గా మారడంతో నిత్యావసరాలు అందక ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. జీవనానికి ఇబ్బందిగా మారిందని గ్రామసభలో ప్రస్తావించదలిచేందుకు యత్నించగా సంబంధిత అధికారులు లేరు. గ్రామానికి అనుబంధంగా ఉన్న రాష్ట్ర రహదారులు ఇటీవల కురిసిన వర్షాలతో గుంతలమయమై రాకపోకలకు తీవ్ర సమస్యగా మారిందని పీడబ్ల్యుడి అధికారులతో చర్చించాలని భావించిన దళిత సంఘాల ప్రముఖులకు నిరాశ ఎదురైంది. మరో వ్యక్తి ఉచిత విద్యుత్‌కు బదులు రూ.25వేల బిల్లు వచ్చిందని వాపోయాడు. గ్రామసభను దొమ్మసంద్ర గ్రామపంచాయతీ అధ్యక్షుడు నరేశ్ ప్రారంభించి మాట్లాడుతూ గ్రామంలో సుమారు 35వేల జనాభా ఉందని తగిన ఆదాయం లేక వెనుకబడిందన్నారు. పంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు సాధించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. గ్రామసభలో ఉపాధ్యక్షులు దివ్య, పీడీఓ మంజునాథరెడ్డి, సభ్యులు కొందరు పాల్గొన్నారు. అధికారుల గైర్హాజరుపై గ్రామస్తులు ఆక్రోశం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై స్పందించేందుకు అధికారులు లేకుంటా ఎలాగని ప్రజాప్రతినిధులను ప్రశ్నించారు. దీనిపై నరేశ్ స్పందిస్తూ త్వరలోనే మరో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్న గ్రామస్థులు

గుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోండి

▸ ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత కార్మికులు కార్మికశాఖ ఇచ్చే గుర్తింపుకార్డుతో ప్రభుత్వ సౌలభ్యాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సుబ్బారెడ్డి సూచించారు. పట్టణంలోని షిర్డీసాయిబాబా మందిరం వెనుక భాగ్యనగర కట్టడకార్మిక సంఘం కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్మికులంతా చేరి చక్కటి కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఇక్కడ సమాజసంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్మికశాఖ సభ్యత్వ నమోదు పొందడం ద్వారా ఏడాదిఅనంతరం వైద్య ధనసాయం, పిల్లల విద్యకు ప్రోత్సాహకం, వివాహానికి ప్రోత్సాహకం, ఇతర ఉపకరణాల కొనుగోలుకు చేయూత, ఒకవేళ ప్రమాదంలో అంగవైకల్యం పొందితే పింఛను, ప్రమాద పరిహారం వంటివి లభిస్తాయన్నారు. తద్వారా కుటుంబానికి భరోసా ఉంటుందన్నారు. గుర్తింపుకార్డును మూడేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు శ్రీనివాసరెడ్డి, గడ్డం రమేశ్, భాగ్యనగర కట్టడ కార్మిక సంఘం అధ్యక్షుడు వి శివశంకర్, ఉపాధ్యక్షుడు చిన్నప్పయ్య, కార్యదర్శి విశ్వనాథ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి ప్రతిష్ఠాపన



కలశాలతో ఊరేగింపు

విజయపుర, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని సంతె మైదానం సమీపాన అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. బుధవారం ఉదయం ఆలయ ఆవరణలో గణపతిపూజ, గంగపూజ, నవగ్రహ హోమం, వివిధ పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. ప్రతిష్ఠాపనలో భాగంగా ముత్తైదువులు సహా అయ్యప్ప భక్తులు కళశాలతో మంగళవాయిద్యాల నడుమ పుర వీధులలో ఊరేగారు. స్వామికి మహ మంగళారతి అనంతరం ప్రసాద వినియోగం నిర్వహించారు. ఆలయాన్ని వివిధ పుష్పాలతో ముస్తాబు చేశారు. భక్తుడు మంజణ్ణ మాట్లాడుతూ కొన్నేళ్లుగా అయ్యప్పమాల ధరిస్తున్నామని స్వామి అనుగ్రహంతో అందరి సహకారంతో ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసినట్టు తెలిపారు. భక్తులకు అన్న సంతర్పన నిర్వహించారు.



అలంకరణలో అయ్యప్పస్వామి

నేరాల నియంత్రణకు అందరి సహకారం

▸ సీఐ దయానంద్


బంగారపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు ప్రజలందరూ సహకరించాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దయానంద్ పిలుపునిచ్చారు. పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవలికాలంలో మాదకద్రవ్యాల సమస్య పెరిగిందని వీటి నియంత్రణకు కేజీఎఫ్ జిల్లా ఎస్పీ శాంతరాజు, డీఎస్పీ పాండురంగల మార్గదర్శకంలో నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్టు గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కాగా శాంతిభద్రతలకు భంగం కలిగేలా ఎవరు వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే బాలికల పాఠశాలలో నిత్యం ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లతో జాగృతి కల్పిస్తున్నామన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారి సమస్యలను సానుకూలంగా ఆలకించి పరిష్కరించేలా సిబ్బందికి సైతం సూచనలు చేశామన్నారు. మీడియా సమావేశంలో ఎస్సై రాజణ్ణ, ఎస్‌బి మంజునాథ్, ఆపద్బంధు నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో సీఐ దయానంద్ తదితరులు

టెక్ సమ్మిట్‌లో సందడి....





టెక్ సమ్మిట్ రెండో రోజు సదస్సులో కూడా సందర్శకులు ప్రదర్శనలో ఎలక్ట్రానిక్స్ వ్యర్థాల ద్వారా రూపొందించిన గండభేరుండ, రకరకాల రోబోల నమూనాల వద్ద సెల్ఫీలు తీసుకున్నారు. (ఆంధ్రజ్యోతి, బెంగళూరు)

రాధికా కరియ అనవచ్చు...

మంత్రి జమీర్ అంటే దుమారమా..?

▸ కాంగ్రెస్ నేత తేజస్విని వివాదాస్పద వ్యాఖ్య

బెంగళూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కుమారస్వామి పట్ల మంత్రి జమీర్ అహ్మద్ 'కరియ' (నలుపు) వ్యాఖ్యల వివాదం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఆరంభంలో సీఎం సమర్థించినా ఇటీవల వ్యక్తిగతంగా ఎవరినీ విమర్శించరాదని మంత్రి జమీర్ వ్యాఖ్యలు తప్పు అన్నారు. అయితే ఇటీవలో కాంగ్రెస్‌లో చేరినా మాజీ ఎమ్మెల్సీ తేజస్వినిగౌడ వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేశారు. మైసూరులో బుధవారం ఆమె మాట్లాడుతూ రాధికా కుమారస్వామి కరియ, చిన్ను అంటే తప్పు కాదుగానీ మంత్రి జమీర్ అహ్మద్ పిలిస్తే దుమారమా..? అంటూ ప్రశ్నించారు. ఓ ఇంటర్వ్యూలో రాధికా తాను కుమారస్వామిని చిన్ను, కరియ అంటూ పిలుస్తానని చెప్పిన అంశాన్ని తేజస్వినిగౌడ ప్రస్తావించారు. ఈ వివాదం తగ్గిందనే తరుణంలో మరోసారి రచ్చకెక్కినట్టయ్యింది.

ఉత్సాహంగా ఏక్తా దివస్



ఏక్తా దివస్‌లో ప్రిన్సిపాల్ తదితరులు

చిక్కబళ్ళాపుర, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోల్డెన్‌గ్లిమ్స్ కళాశాలలో క్వామీ ఏక్తా దివస్ కార్యక్రమం ఉత్సాహం జరిగింది. స్వామి వివేకానంద కళాశాల బళగ, కళాకేంద్రం చిక్కబళ్ళాపుర, నెహ్రూ యువకేంద్రం ఇతర సంఘాలు సహకారం అందించాయి. ప్రిన్సిపాల్ మునికృష్ణ మాట్లాడుతూ దేశ చరిత్ర గొప్పదని, సాంస్కృతిక వారసత్వాన్ని పదిలంగా భావితరాలకు అందించాలన్నారు. మన దేశ జాతీయస్ఫూర్తి ఇతర దేశాలకంటే గొప్పదన్నారు. స్వామి వివేకానంద ఆదర్శాలను ప్రస్తావించారు. దేశభక్తి గీతాలు, జానపద గీతాలు, అవగాహన గీతాలు సభికులను అలరించాయి. కార్యక్రమంలో కళాకేంద్రం అధ్యక్షుడు డాక్టర్ సునాగేంద్రనాథ్, పురస్కార గ్రహీత కళాకారుడు మునిరాజు, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీలు

చింతామణి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సౌందర్య గ్రామీణ, పట్టణ అభివృద్ధి సంస్థ చింతామణి, చిన్మయ మిషన్ కోలారు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో పాఠశాల విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. వందమందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. చిన్మయ మిషన్ టీచర్ ఆనందమ్మ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ముగింపులో ఆమె మాట్లాడుతూ సౌందర్యసంస్థ చక్కటి కార్యక్రమం నిర్వహించడం ద్వారా చిన్నారుల్లో జ్ఞానార్జన పెరుగుతుందన్నారు. సౌందర్యసంస్థ డైరెక్టర్ వెంకట రామప్ప మాట్లాడుతూ సంస్థ ద్వారా సంస్కృతిని పెంపొందించే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతల వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. సుజాతమ్మ, కవితమ్మ, నరసమ్మ, వెంకటలక్ష్మి, పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సౌందర్యసంస్థ డైరెక్టర్ వెంకట రామప్ప తదితరులు

ఘనంగా సంకష్ట చతుర్థి పూజలు



ద్విముఖ గణపతికి అలంకరణ


శిడ్లఘట్ట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని పట్టణంలోని అశోకరోడ్డులో కొలువైన ద్విముఖ గణపతి ఆలయంలో విశేషపూజలుకొనసాగాయి. కార్తీక సోమవారాల నేపథ్యంలో మంగళవారం రావడంతో మరింత ప్రత్యేకతగా ఉత్సవాలు సాగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఉపవాసం ఉండి పూజల్లో పాల్గొన్నారు. మంగళవారం రాత్రి మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పండిత కృష్ణమూర్తి శాస్త్రి సోదరులు ధార్మిక కార్యక్రమాలను నెరవేర్చారు. విద్యార్థులు సైతం పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాగా శనిమహాత్మస్వామి ఆలయంలోని వినాయకుడికి కూడా విశేషపూజలు నిర్వహించారు.

రైల్లో నుంచి పడి యువకుడి మృతి

గుత్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వేస్టేషన్ పరిధిలోని యార్డు వద్ద రైల్లో నుంచి జారి పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప బుధవారం తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడికి 28 సంవత్సరాలు ఉంటాయని, 5.2 అడుగులు ఎత్తు, బ్లూ జీన్స్ మిక్స్ కలర్ ప్యాంట్, షర్ట్ ధరించాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోడు వినండి..!

- తుంగభద్ర బోర్డు అకౌంట్ ఫ్రీజ్
- అకౌంట్ ఫ్రీజ్ తీయకపోతే నిధులు వెనక్కి
- అదే జరిగితే ఉద్యోగులకు జీతాలు లేనట్టే
- ఆందోళనలో టీబీపీ ఉద్యోగులు
- వైసీపీ పాపాలు.. ఉద్యోగులకు శాపాలు
- అనంత ఎమ్మెల్యేలతో కాంట్రాక్టర్ల చర్చలు?



తుంగభద్ర జలాశయం

కర్నూలు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర బోర్డు పనుల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలు ప్రస్తుతం బోర్డు ఉద్యోగుల పాలిట శాపంగా మారాయి. మూడు నెలలుగా జీతాలు అందక ఆర్థిక అవస్థలు పడుతున్నారు. బోర్డు అకౌంట్ ఫ్రీజ్ తొలగించి.. నవంబరు ఆఖరులో ఏపీ ప్రభుత్వం ఇచ్చిన నిధులు ఖర్చు చేయకపోతే వెనక్కి వెళ్తాయని, అదే జరిగితే వచ్చే ఏడాది మే వరకు జీతాలు కూడా వచ్చే అవకాశం ఉండదని బోర్డు ఉద్యోగులు ఆందోళన చెదుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తుంగభద్ర బోర్డు పనుల్లో అవినీతి అక్రమాలు జరిగి ఉంటే.. సంబంధిత కాంట్రాక్టర్లపై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) విచారణ చేయించాలి. అవసరమైతే చట్టరమైన చర్యలు తీసుకోవాలే కానీ ఇలా ఖాతాలను సీజ్ చేసి నిధులు లేకుండా చేయడం ఏమిటని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో తుంగభద్ర కాలువ ఆధునికీకరణ పేరిట దాదాపు రూ.919 కోట్లకు టెండర్లు పిలిచారు. తొలి దశలో రూ.519.80 కోట్లతో ఎల్లెల్సీ ఆర్‌సీసీ లైనింగ్ పనులు చేస్తే.. సుమారు రూ.350 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. రెండవ దశలో మరో రూ.400 కోట్లకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. ఈ పనుల్లో వైసీపీ హయాంలో బోర్డులో పని చేసిన ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు, ఏపీ ప్రభుత్వం ఓ ఈఎన్‌సీతో పాటు బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన బడా కాంట్రాక్టర్ ఒకరు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ కాంట్రాక్టరు గత ఎన్నికల్లో ప్రకాశం జిల్లా గిద్దలూరు వైసీపీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశాడు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక తుంగభద్ర బోర్డు పనుల్లో అక్రమాలు జరిగాయని, వాటిని నిగ్గు తేల్చాలని రాయదుర్గం ఎమ్మెల్యే, విప్ కాల్వ శ్రీనివాసులు ప్రభుత్వానికి లేఖ రాశారు. బోర్డు పనుల్లో అక్రమాలపై విచారణ చేసి నిగ్గు తేల్చే వరకు తుంగభద్ర బోర్డుకు కేటాయించిన నిధులు వినియోగించకూడదని, ఎలాంటి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ) ఇవ్వవద్దని ఏపీ ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రెటరీ టీబీపీ బోర్డు కార్యదర్శి, కర్ణాటక ప్రభుత్వం ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శికి లేఖ రాయడం.. ఆ వెంటనే బోర్డు ఖాతాను ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే.



తుంగభద్ర దిగువ కాలువ సీసీ లైనింగ్ పనులు (ఫైల్)

నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం!

తుంగభద్ర బోర్డుకు ఏపీ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్‌లో కేటాయించిన నిధులు ఈ నెల 30వ తేదీలోగా వినియోగించుకోవాలని 11వ తేదీన సర్క్యులర్ మెమో నంబరు.ఎఫ్ఐఎన్02-15069/11/2924-ఇ-ఎస్ఈసీ-డీటీఏలో స్పష్టంగా పేర్కొన్నారు. సీఎఫ్ఎంఎస్ బడ్జెట్ ఆర్డర్ నంబరు.4400014207, 55500014351లో కేటాయింపులు చేసిన నిధులు 2024-25కు సంబంధించి 2వ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రకారం ఆగస్టు 1 నుంచి నవంబరు 30వ తేదీ వరకే ఉంటుంది. అంటే ఆయా హెడ్ ఆఫ్ అకౌంట్స్ కింద అందుబాటులో ఉన్న బడ్జెట్‌ను ఈ నెల 30వ తేదీలోగా వినియోగించుకోవాలి. లేని పక్షంలో బడ్జెట్ వెనక్కి వెళ్తుందని అంటున్నారు. బోర్డు అకౌంట్‌ను ఫ్రీజ్ చేయడంతో ఆ నిధులు ఎలా వినియోగించుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఏపీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కర్ణాటక ప్రభుత్వానికి లేఖ రాసి బోర్డు అకౌంట్ ఫ్రీజ్ తొలగించాలని, బోర్డు ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని తుంగభద్ర బోర్డు వర్క్ చార్జ్‌డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టీకే గోపాల్‌కృష్ణ విన్నవిస్తున్నారు. మరో పక్క బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ కాంట్రాక్టర్ సహా మరో మరికొందరితో పెండింగ్ బిల్లులు చెల్లింపు, అగ్రిమెంట్ చేసిన రూ.400 కోట్లు టెండర్లు రద్దు చేయకుండా కొనసాగించేలా అనంతపురం జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపినట్లు సమాచారం.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1630.78	1,599.59
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,850	78
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,645	9,783
నీటి నిల్వ (టీఎంసీలు)	96.91	21.00

ఆశాజనకంగా కంది



ఏపుగా పెరిగిన కంది పంట

సిరుగుప్ప, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తాలుకాలో కందిపంట ఆశాజనకంగా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ యేడాది పుష్కలంగా వర్షాలు కురవడంతో వరి, చెరకు, పత్తి, కంది పంటలు దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కంది పంట ఏపుగా పెరిగిందని, మంచి దిగుబడి వస్తుందని చెబుతున్నారు.

జోరుగా డ్రైనేజీ నిర్మాణ పనులు



31వ వార్డులో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు

సిరుగుప్ప, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 31 వార్డులో రూ. 20 లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో చాలా రోజుల నుంచి డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నగరసభ అధికారులు దృష్టి సారించి రూ. 20 లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులను సంబంధిత కాంట్రాక్టర్లు వేగంగా చేస్తున్నారు. నగర సభ ఇంజనీర్లు ఈ పనులపై పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద టీచర్ల నివాళి

బళ్లారి సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠ శాలలో ఇందిరాగాంధీ 107వ జయంతి ని ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. కర్ణాటక రాష్ట్ర యాక్షన్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షులు రవిచెళ్ల గుర్కి మాట్లాడారు. ఇందిరాగాంధీ భారత తొలి మహిళా ప్రధానిగా సేవా చేశారన్నారు. ఆమె పేదరిక నిర్మూలనకు కృషి చేశారని కొనియాడారు. భూసంస్కరణలు అమలు చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ దేవదాసీల సర్వే నిర్వహించండి: కలెక్టర్

బళ్లారి సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జెండర్ మైనార్టీలు, మాజీ దేవదాసీ మహిళలకు సౌకర్యాలు కల్పించేందుకు సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కెస్వాన్ వీడియో హాల్లో లింగత్వ మైనార్టీల పునరావాస పథకం , మాజీ దేవదాసీ పేనరావాస పథకాలపై బుధవారం జిల్లాస్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ అణగారిన మహిళల నిస్సహాయతను తొలగించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు జిల్లా స్థాయిలో అడ్వైజరీ సెల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ దృష్ట్యా జిల్లాలో తృతీయ లింగాలను గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేసి వారికి ప్రభుత్వ సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లింగ మైనార్టీలు, మాజీ దేవదాసీ మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అన్ని శాఖలతోపాటు మహిళా శిశు అభివృద్ధి శాఖ పరస్పరం సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాలో మొత్తం 1070 మంది జెండర్ మైనార్టీలు ఉన్నారని, సంఘం కింద సొసైటీ అణచి వేతకు, దోపిడికి గురవుతున్న లింగాల మైనార్టీలకు ప్రభుత్వం రూ. 30వేలు ప్రోత్సహకం ఇస్తోందని వెల్లడించారు.

తాలూకాల వారిగా లింగ మైనార్టీలు

బళ్లారి రూరల్-58, బళ్లారిసిటీ- 448, కురుగోడు 145, కంప్లి 134, సిరుగుప్ప 167, సండూర్ 117, 2007- 08 సర్వే ప్రకారం జిల్లాలో మొత్తం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

4288 మంది మాజీ దేవదాసీ మహిళలను గుర్తించగా అందులో మొత్తం 4043 మంది మాజీ దేవదాసీ మహిళలకు నెలకు రూ.2000 చెల్లించారు. 245మంది మాజీ దేవదాసీ మహిళలకు ఇంకా పెండింగ్‌లో ఉన్నారని తెలిపారు. లింగబేధాలు, మాజీ దేవదాసీ మహిళలు స్వావలంబనతో జీవించేందుకు బ్యాంకుల్లో రుణ సదుపాయం కల్పించాని కలెక్టర్ ఆదేశించారు. రూ. 2లక్షల వరకు ఎలాంటి పూచికత్తు లేకుండా రుణాలు ఇచ్చేలా అన్ని బ్యాంకులను ఆదేశించాలని లీడ్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖకు చెందిన జలాలప్ప, సీడీపీఓ అధికారులు, విముక్తి సంఘం, ప్రగతి సేవాసంఘం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వంటగది పరిశీలన



మెట్రి పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

కంప్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని మెట్రి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేసే వంట గదిని అధికారులు బుధవారం పరిశీలించారు. కొన్ని రోజుల క్రితం మెట్రి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో బల్లి పడిన మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో జిల్లా ఉన్నతాధికారులు భోజనాన్ని పరిశీలించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈక్రమంలోనే బుధవారం మధ్యాహ్న భోజన జిల్లా అధికారి కస్తూరి అక్కడకు చేరుకుని గ్రామస్థులతో చర్చించారు. వంట వారిని తొలగించాలని వారు జిల్లా అధికారిని కోరారు. పాఠశాలకు ఇస్కాన్ మధ్యాహ్న భోజన మిషన్ నుంచి భోజనం అందేలా చూడాలని తెలియజేశారు. ఇస్కాన్ మధ్యాహ్న భోజనం వచ్చేవరకు చుట్టుపక్కల పాఠశాలలో పనిచేసే వంటవారి ద్వారానే కొన్నిరోజులు మధ్యాహ్న భోజనం అందించేలా చూస్తామని తెలిపారు. అనంతరం వంటగదిని పరిశీలించారు. వంట గది, నీటి తొట్టెను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మరోసారి ఇలా జరిగితే చర్యలు తప్పవని ఉపాధ్యాయులను హెచ్చరించారు. మధ్యాహ్న భోజనం లేకపోవడంతో విద్యార్థులు వారి ఇళ్ల నుంచి క్యారియర్ తెచ్చుకుంటున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దొడ్డ బసప్ప, హనుమంతప్ప, ప్రధానోపాధ్యాయులు మూర్తి, తాలుకా అధికారి శివప్ప నాయక్, జగదీష్, లోకేష్, మహేష్, పక్కీరప్ప, సోమశేఖర్, మెట్రి గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు

శిశు సంరక్షణలో ఆరోగ్య కార్యకర్తల పాత్ర కీలకం

గంగావతి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువుల సంరక్షణలో తల్లులతో పాటు ఆశా కార్యకర్తల పాత్ర ప్రముఖమైనదని డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. అంతర్జాతీయ నవజాత శిశు దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో జాగృతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పాలనా మండలి జిల్లా పంచాయతీ, కొప్పళ జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, తాలూకా ఆరోగ్య అధికారులు గంగావతి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలో డాక్టర్ అంబేడ్కర్ నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ రమేష్ మాట్లాడుతూ నవజాత శిశువుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తినపుడు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి, పిల్లల వైద్యులను సంప్రదించాలన్నారు. తద్వారా అకాల శిశుమరణాలను అరికట్టవచ్చన్నారు. ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకు 'నవజాత శిశువుల సంప్తహా' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల సంరక్షణ వారి అభివృద్ధి, నవజాత శిశువుల పోషణ గురించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశ్యంతోనే కార్యక్రమాన్ని వారం రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాలూకా ఆరోగ్య శిక్షణాధికారి ఆశాబేగం, ఆరోగ్య సిబ్బంది రేణుకా, పాటీల్, క్షయరోగ సిబ్బంది మల్లికార్జున, హుసేన్‌భాష, ఆరోగ్య సిబ్బంది బీదు, మంజునాథ్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



గంగావతి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఇస్కాన్ ద్వారా మధ్యాహ్న భోజనం వద్దు: ఏఐయూటీయూసీ

బళ్లారి సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత పాఠశాలలకు ఇస్కాన్ సంస్థ మధ్యాహ్న భోజనాన్ని పంపిణీ చేయరాదని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా పంచాయతీ సీఈఓకు ఏఐయూటీయూసీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంలో ఏఐయూటీయూసీ జిల్లాకార్యదర్శి ప్రమోద్ మాట్లాడుతూ గత 20-22 ఏళ్ళగా మధ్యాహ్నం పథకం కింద పని చేస్తున్న ఆర్థికంగా వెనుకబడిన పేద వారు ఉన్నారన్నారు. ఇస్కాన్ సంస్థ మధ్యాహ్న భోజనాన్ని తీసుకోరావడం ద్వారా వంట సిబ్బంది ఉద్యోగం కోల్పోతారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే కాంట్రాక్టును స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వకూడదని, ఎన్నోఏళ్లగా పనిచేస్తున్నకార్మికులు ఉద్యోగం కోల్పోతారన్నారు. ప్రతి ఒక మధ్యాహ్నభోజన కార్మికుడికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

కార్యక్రమంలో యూనియన్ సలహాదారులు నాగరత్న,నాయకులు మంజుళ, జయమ్మ, దుర్గమ్మ, బసమ్మ,మంగళమ్మ, హేమావతి,నీలమ్మ, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

సర్వర్‌తో సమస్యలు



దేవసముద్రంలో రేషన్ షాపు వద్ద కూర్చున్న మహిళలు



అంగడి వద్ద క్యూలో రేషన్ కార్డులు

కంప్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రేషన్ దుకాణాల వద్ద సర్వర్ రాకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు వేచి చూడాల్సి వస్తోంది. కంప్లి తాలుకాలోని పలు గ్రామాలలో సర్వర్ పనిచేయకపోవడంతో లబ్ధిదారులు రేషన్ అంగళ్ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు కాపలాకాచే పరిస్థితి ఏర్పడింది. దేవసముద్రం రేషన్ అంగడి వద్ద బుధవారం సర్వర్ పని చేయకపోవడంతో మహిళలు క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడలేక కూర్చుండిపోయారు. గ్రామస్థుడు వెంకోబ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రేషన్ అంగళ్లలో సర్వర్ సమస్య వల్ల పూర్తిగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ విషయంపైన తాలుకా ఆహార శాఖ అధికారి విరుపాక్షిగౌడను విచారించగా బెంగళూరు పౌర ఆహార శాఖలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ వల్ల కొద్దివరకు ఇబ్బందులు కలిగి వుండవచ్చు రెండు గంటల్లో ఈ సర్వర్ సమస్య తొలగి ప్రజలకు సక్రమంగా రేషన్ అందిస్తామని తెలిపారు.

చిన్నారుల్లో ప్రతిభను గుర్తించాలి: న్యాయాధికారి



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి

బళ్లారి సిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభను గుర్తించాలని సివిల్ కోర్టు న్యాయాధికారి రాజేష్ హొసమనె పేర్కొన్నారు. బాలల దినోత్సవంలో భాగంగా జిల్లాపరిపాలన, జిల్లాపంచాయతీ, రాజ్యబాల భవన్ సొసైటీ బెంగళూరు, మహిళా శిశు అభివృద్ధి శాఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ప్రభుత్వ విద్యాశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, జిల్లా బాల భవన్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ పోటీలను జిల్లాపంచాయతీ హాల్లో ప్రారంభించి ఆయన మాట్లాడారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం జిల్లా పంచాయతీ ప్లానింగ్ డైరెక్టర్ వినోద్ కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ పిల్లలకు శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, కర్ణాటక సంగీతం, హిందూస్థానీ సంగీతం, వాయిద్య సంగీతం, తబలా, మృదంగం, వేణువు, డోలు వంటి సృజనాత్మక ప్రదర్శన కళలు వంటి వివిధ పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్ వేదవతి, జిల్లా శిశు సంరక్షణ అధికారి నాగప్ప, జిల్లా శిశు కమిటీ సభ్యులు మంజునాథ్, గంగమ్మ, ప్రాజెక్టు అధికారి మోహన్‌కుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల తనిఖీ



దేవసముద్రం ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఆరోగ్య శాఖ అధికారులు

కంప్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కంప్లి తాలుకా పరిధిలోని మెట్రి, దేవసముద్రం, కంప్లి తదితర ఆస్పత్రులను కేంద్రం ఆరోగ్య శాఖ సీఆర్‌ఎం బృందం తనిఖీ చేసింది. దేవసముద్రంలో అధికారి రాజేష్ కడేమనె అక్కడున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగులకు తాగునీరు, విద్యుత్ ఇతర సమస్యలపైన, ఇతర రికార్డులను, ఫైల్స్‌ను పరిశీలించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా, ప్రజలకు ఆరోగ్య శాఖ ద్వారా వచ్చే ఏ సదుపాయాన్ని అయినా ప్రజలకు ఇవ్వాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం తగదన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారి రమేష్‌బాబు, అబ్దుల్, టీహెచ్‌వో అరుణ్, రేవణ సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిధులు ఇవ్వండి



ఎమ్మెల్యే జేఎన్ గణేష్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆలుమత సమాజ పదాధికారులు

కంప్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కాగినల్లి గురుపీఠం వద్ద వసతి నిలయం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఆలుమత సమాజ సభ్యులు ఎమ్మెల్యే జేఎన్ గణేష్‌కు వినతి పత్రం అందజేశారు. కురుగోడు పట్టణంలో మల్లికార్జున మాట్లాడుతూ గురుపీఠంకు నిధులు కల్పిస్తే తమ ఆలుమత సమాజానికి నియోజకవర్గం నుండి గుర్తింపు లభిస్తుందన్నారు. శాసనసభలో ఈ విషయంపై చర్చించి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, బసవరాజు, గాదెలింగ, ఆలుమత సమాజ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

కోర్టు ఆవరణలో లాయర్‌పై దాడి

● పరిస్థితి విషమం ● న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హోసూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోర్టు విధులు ముగించుకుని బయటకు వస్తున్న లాయర్‌పై ప్రత్యర్థి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన బుధవారం హోసూరులో జరిగింది. దాడిలో గాయపడి కుప్పకూలిన కణ్ణన్‌ను తోటి న్యాయవాదులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడే ఉన్న పోలీసులు ఘటనపై ఆరా తీశారు. కాగా దాడి చేసిన ఆనంద్ కోర్టులోనే లొంగిపోయాడు. నగరంలోని ప్రముఖ లాయర్‌వద్ద కణ్ణన్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఇంతకుముందు గుమాస్తాగా పనిచేస్తున్న ఆనంద్‌కు, కణ్ణన్‌కు మనస్పర్థలు ఉండేవి. ఈక్రమంలోనే ఆనంద్ దాడి చేశాడు. ఈ ఘటనపై న్యాయవాదుల సంఘం సభ్యులు భైఠాయించి నిరసన తెలిపారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కణ్ణన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

అంధులకు లయన్స్‌క్లబ్ చేయూత



నిత్యావసరాలు అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

బెంగళూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హోసూరు మునిసిపాలిటీ పరిధిలో ఆర్థికంగా వెనుకబడి జీవనం గడుపుతున్న 30మందికిపైగా అంధులకు లయన్స్‌క్లబ్ చేయూత అందించింది. బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ అంబికా పాల్గొని నిత్యావసర వస్తువులను అందచేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మహేంద్రన్ మాట్లాడుతూ పాక్షిక అంధత్వం కలిగినవీరికి ఉపాధి కల్పిస్తామన్నారు. పుట్టినరోజు, పండుగల పర్వదినాలలో వారికి బహుమతులు అందచేసి ఆనందంగా ఉంచేలా కృషి చేస్తామన్నారు. లయన్స్‌క్లబ్ కార్యదర్శి కణ్ణన్, కోశాధికారి మహంతేశ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

హిందీని బలవంతంగా రుద్దడం తగదు



మీడియాతో తిరుమావళన్

హోసూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో హిందీని వ్యతిరేకిస్తున్న తరుణంలో కేంద్రప్రభుత్వం బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తోందని, ఇది సరికాదని విడుదల చిరుత పార్టీ అధ్యక్షుడు తిరుమావళన్ మండిపడ్డారు. హోసూరు పర్యటనలో ఉన్న ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ కొంతకాలంగా హిందీని పాఠ్యాంశంలో చేర్చడాన్ని తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకిస్తూ విజయం సాధిస్తూనే ఉందన్నారు. కానీ బీజేపీ అధి కారంలోకి వచ్చినప్పటి నుంచి హిందీభాషను తమిళ నాడులో ప్రవేశ పెట్టేందుకు తహతహలాడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో పార్టీల మధ్య చిచ్చు పెట్టి చీల్చడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అందులో భాగంగా అన్నాడీఎంకేలో చీలికలు తెచ్చారని, ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవడానికి ప్రయత్నాలు జరుగు తున్నాయన్నారు. ప్రశాంతంగా ఉన్న తమిళనాడు రాష్ట్రంలో భాషల పేరిట రాజకీయ అలజడి సృష్టిస్తే సహించబోమన్నారు. 2026లో తమిళనాడు శాసనస భ ఎన్నికల్లో డీఎంకే కూటమి మరింత బలోపేతం చేసుకుని భారీ విజయం సాధిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

28వ వార్డులో మేయర్ పర్యటన



సమస్యలు ఆలకిస్తున్న మేయర్ సత్య

హోసూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 28వ వార్డులో మేయర్ సత్య బుధవారం పర్యటించారు. గాంధీనగర్, గాడ్‌నగర్, వీఓసీ నగర్ తదితర ప్రాంతాలలో పర్య టించి స్థానికుల సమస్యలను ఆలకించారు. తాగునీరు, వీధిదీపాలు, డ్రైనేజీ స్థితిగతులపై ఆరా తీశారు. వర్షాకాలంలో వర్షపునీరు ఇళ్లలోకి వస్తోందని లోతట్టు ప్రాంతాల వాసులు వాపోయారు. స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని మౌలిక సదుపాయాలు బాగు చేయాలని అధికారులను ఆదేశించారు. మేయర్ వెంట అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

హోసూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన కృష్ణగిరిలో తిరుక్కురల్ పోటీలలో పెదరపల్లి పాఠశాలకు చెందిన రెండో తరగతి విద్యార్థిని హరిణి విజేతగా నిలిచింది. సాహిత్య పోటీలలో తిరుక్కురల్‌లోని 60 పద్యాలను కంఠస్థం చేసి గుక్కతిప్పకుండా చెప్పింది. బాలిక ప్రతిభపై ప్రధానోపాధ్యాయుడు పొన్‌నాగేశ్ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన బాలికకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందచేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రకటించారు.

కాలువ తవ్వి.. వదిలేశారు



మరమ్మతు కోసం తవ్విన కాలువ



కాలువలో నిలిచిన మురుగు నీరు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ శ్రీరాంపురం కాలనీలోని ప్రభుత్వ పాఠశాల వద్ద తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు కోసం కాలువ తవ్వి 10 రోజులైనా మరమ్మతులు చేయలేదు. దీంతో కాలువలో మురుగు నీరు పరిసరాలు అపరిశుభ్రం అవుతున్నాయి. కాలులో మురుగు నీటి చేరికతో దుర్వాసన వస్తుండటంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు తాగునీటిలో కలిసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కార్పొరేషన్ కమిషనర్ దృష్టి సారించి మరమ్మతుల కోసం తవ్విన కాలువను పూడ్చేరీతిలో సంబంధిత కాంట్రాక్టరుపై చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.